

పట్టణంలో వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఖుర్షిద్ నగర్‌కు చెందిన ఎన్నావార్ కవిత(32) ఇంట్లో చిన్న గొడవ కారణంగా.. శనివారం ఉదయం 10గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కానీ మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త చంద్రకాంత్ బంధువులకు ఫోన్ చేసి ఆచూకీ కోసం వెతికినా తెలియలేదు. దీంతో భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు తెలిపారు.



సోనాల గ్రామసభలో అధికారులను, నాయకులను నిలదీస్తున్న లబ్ధిదారులు

లబ్ధిదారులను సముదాయిస్తున్న నాయకులు

గ్రామాల్లో.. పథకాల పంచాయితీ!



- జిల్లాలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం
- లబ్ధిదారుల జాబితాలతో ఎవరికి వారే ప్రచారం
- స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్‌గా పైరవీలు
- గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్న ఆశావహ నేతలు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 18 మండలాల పరిధిలో 473 గ్రామ పంచాయతీలు

ఆదిలాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో కొత్త పంచాయితీ ఏర్పడుతోంది. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రభుత్వం పదేపదే చెబుతూ వస్తోంది. ప్రతిపక్షాలు మాత్రం పథకాల లొసుగులను ఎత్తి చూపుతూ ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాయి. నాలుగు పథకాలకు సంబంధించి ప్రత్యేక సర్వే, గ్రామసభలు, లబ్ధిదారుల ఎంపికను చేపట్టడంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామాల్లో కొంత సందడి వాతావరణం కనిపించింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారంతా సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు.

నాలుగు పథకాలపైనే చర్చ

గ్రామాల్లో ఏనలుగురు కలిసిన కొత్తగా అమలు చేయబోయే నాలుగు పథకాల గురించే మాట్లాడుకోవడం కనిపిస్తోంది. జిల్లాలో 18 మండలాల పరిధిలో 473 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారుల జాబితాను వెల్లడించారు. ఇందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా 16,730 దరఖాస్తులు రాగా.. రేషన్‌కార్డుల కోసం 32వేల 727 దరఖాస్తులు, ఆత్మీయ భరోసా కోసం 13,666 దరఖాస్తులు, రైతు భరోసా కోసం 387 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. లక్షల్లో లబ్ధిదారులు ఉండగా.. వేలల్లో పథకాలను మంజూరు చేయడంతో తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. లబ్ధిదారులు పథకాల కోసం స్థానిక నేతల వద్దకు క్యూకడుతున్నారు. ఎలాగైనా తమకు పథకాలను మంజూరు చేయించాలని నేతలపై ఒత్తిళ్లు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో నేతల పైరవీలు ఊపందుకుంటున్నాయి. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ఎవరికి వారే అనుకూలంగా మలుచుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

అధికారుల ముందే వాగ్వాదం

గ్రామసభల్లోనే అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. గ్రామానికి వచ్చిన అధికారుల ముందే పోటాపోటీగా తీవ్ర విమర్శలు చేసుకుంటూ నేతలు వాగ్వాదానికి దిగుతున్నారు. కొన్ని గ్రామాల్లోనైతే ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు గ్రామసభలు ముందుకు సాగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా బోథ్ నియోజకవర్గంలో ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటోలు లేవంటూ ఆందోళనకు దిగిన సందర్భాలు ఉన్నాయి. అధికార పార్టీని అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి కనపించింది. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో అధికారులు కూడా ప్రతిపక్షాలకు కొంత అనుకూలంగా వ్యవహరించాల్సి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పైచేయి సాధించేందుకు స్థానిక నేతలు ఎత్తుగడలు వేస్తున్నారు. అలాగే గ్రామాల్లో ఏపార్టీకి ఎక్కువ బలం ఉంటే వారు చెప్పిందే ఫైనల్ అన్నట్లుగా కనిపిస్తుంది. ముఖ్యంగా మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలు లబ్ధిదారుల జాబితాపై ప్రత్యేకదృష్టిని సారించి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

జోరుగా ప్రచారం

ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారులను ఎంపిక

(తరువాయి 6వ పేజీలో...)

ఫటా..ఫట్...

పాఠశాలలపై పకడ్బందీ పర్యవేక్షణ

● ఆశన్న, మండల విద్యాధికారి, ఉట్నూర్



ఆంధ్రజ్యోతి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నారా?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలలపై పకడ్బందీ పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు పేద మధ్య తరగతి పిల్లలు వచ్చి చదువుకుంటున్నందున వారికి విద్యబోధన సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉట్నూర్ మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

ఎంఈవో: ఉట్నూర్ మండలంలో 135 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 200 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, మూడు ఖాళీలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9గంటల నుంచి 4-15 నిమిషాల వరకు పని చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎంఈవో: గతంలో పాఠశాలలకు స్కావెంజర్లు లేక పరిశుభ్రత ఇబ్బందులు ఉండేవి.ప్రస్తుతం స్కావెంజర్లను నియమించడం వల్ల ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు తీసుకుంటున్నాం. స్కావెంజర్లకు 3నెలల బకాయి వేతనాలూ మంజూరు అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలకు స్కూల్ గ్రాండ్స్ మంజూరు అవుతున్నాయా?

ఎంఈవో: అన్ని పాఠశాలలకు స్కూల్‌గ్రాంట్స్ మంజూరు అయ్యాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకొక్క పాఠశాలకు రూ.ఐదు వేల నుంచి ఉన్నత పాఠశాలలకు లక్ష రూపాలయ వరకు స్కూల్ గ్రాండ్ మంజూరు అవుతుంది.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో సక్రమంగా మధ్యాహ్న భోజనం కొనసాగుతుందా?

ఎంఈవో: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగిస్తున్నాం. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మధ్యాహ్న భోజన సమయంలో పర్యవేక్షిస్తున్నారు. (- ఆంధ్రజ్యోతి, ఉట్నూర్)



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు : ఎమ్మెల్యే

ఉట్నూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలలో కూడిన విద్య బోధనను అందించడం జరుగుతుందని, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులుచే విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యతో పాటు ఆట పాటల్లో రాణించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. బాల, బాలికలకు వేరువేరుగా హారువేరుగా హాస్టల్‌ల సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి ప్రసాద్, నర్సింగ్ రావు, డాక్టర్ అనిత, డాక్టర్ రాణి, జావీర్ తదితరులు ఉన్నారు.

రిమ్స్‌లో క్షతగాత్రులకు పరామర్శ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నార్నూర్ మండలం పరిసర ప్రాంతంలో ఇటీవల జరిగిన దుర్ఘటనలో ముగ్గురు చనిపోవడం బాధాకరమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. కాగా ఆ ఘటనలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆయన శనివారం పరామర్శించారు. చికిత్సలు అందిస్తున్న తీరును డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఎంపీకి వివరించారు. అనంతరం బాధితుతో మాట్లాడి వివరాలను తెలుసుకొని ధైర్యం చెప్పారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ చాంబర్‌లో రిమ్స్ అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ డాక్టర్ నరేందర్ రాథోడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

● ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ● జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ ● పాల్గొన్న అధికారులు, విద్యార్థులు



ఉట్నూర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, అధికారులు



ఇచ్చోడలో ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తున్న అధికారులు

ఉట్నూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి); ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి భారత పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఖానాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్, రెవెన్యూ, పోలీసు, సిబ్బంది, క్రీడా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ఓటరు దినోత్సవం ర్యాలీని నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం భీం ప్రాంగణం నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌక్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పని సరిగా ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ గండికోట మొగిలి, క్రీడ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జాదవ్ హేమంత్ నాయక్, కార్యాలయం పరిపాలన అధికారి అమృత్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

● ఓటర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్: ఓటు హక్కు నమోదుతో పాటు దాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ గౌస్‌ఆలం అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతి వెలిగించి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి వారితో కలిసి ముందుకు సాగారు. నుంచి ప్రారంభమైన ర్యాలీ జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకు సాగింది. జడ్పీ హాలులో ఓటు నమోదు, వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించిన వారితో పాటు ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ శ్యామల దేవి, శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ సత్కరించి ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఈవో ప్రణీత, తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

● ఓటు హక్కును వినియోగించుకోవాలి

సిరికొండ: దేశ భవిష్యత్తు ఓటర్ల చేతిలో ఉందనీ, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకుని సక్రమంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయం నుండి మండల కేంద్రంలోని పలు వీధుల గుండా ఓటర్ల అవగాహన ర్యాలీని చేపట్టారు. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, యువకులు, నాయకులు పాల్గొని ప్లకార్డులు చేతబట్టి మన ఓటు-మన హక్కు, ఓటు ఈజ్ యువర్ వాయిస్ అంటూ నినాదాలతో ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తుకారాం మాట్లాడుతూ.. ఓటు అనేది పౌరుని హక్కు మాత్రమే కాదు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు వేయాలని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు, అందుకే వారు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివరాం, ఆర్ఐ విలాస్, నాయకులు ఒరగంటి పెంటన్న, షేక్ ఇమామ్, ఎండీ రంజాన్, కంచం లక్ష్మణ్, సాయిని నర్సయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యత

ఇచ్చోడ: ప్రజాస్వామ్యంలో ఓటుకు అధిక ప్రాధాన్యం ఉందని, ఆ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటి తహసీల్దార్ రమేష్, ఆర్ఐ హుస్సేన్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ జోషి, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

● క్రీడా పోటీలను ప్రారభించిన జిల్లా న్యాయాధికారి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేసుల ఒత్తిడిలో ఉండే న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టు ఉద్యోగుల మధ్య టాస్ వేయగా న్యాయవాదులు బ్యాటింగ్ ఎంచుకున్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని బాగా ఆడాలని ఆకాంక్షించారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఉత్సహ పరిచారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఆటలతో ఉద్యోగులు, న్యాయవాదులకు ఉల్లాసంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడాల్లో గెలుపోటములుంటాయని, వాటిని క్రీడా స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, దుర్గారాణి, ప్రమీల జైన్, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

● రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఎస్పీ గౌస్‌ఆలం

● రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో 2కే రన్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాల కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 2కే రన్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీవో కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్టీవో కార్యాలయంలో బెలూన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి అల్లె శ్రీనివాస్, ఎంవీఐ కే.రవీందర్, ప్రదీప్ గౌడ్, అశ్వంత్ కుమార్, ఏఎంవీఐలు విద్యాధర్ రెడ్డి, ప్రత్యూష, వినయ్ కుమార్, హరింద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు జిల్లాకేంద్రంలోని పరేడ్ గ్రౌండ్ ముస్తాబయ్యింది. ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నారు. అయితే ఇక్కడ ఏర్పాట్లు చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాజర్షిషా జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఎక్కడ తప్పులు దొర్లకుండా సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వం 26న జనవరి నుంచే నాలుగు కొత్త పథకాలను అమలు చేయనున్న నేపథ్యంలో లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటల ప్రదర్శన, అవార్డుల ప్రదానం వాటికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.



ఆదిలాబాద్‌లో ముస్తాబైన పరేడ్ గ్రౌండ్



బోథ్‌లో ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద జెండాలను కడుతున్న సిబ్బంది

● బోథ్‌లో కార్యాలయాల ముస్తాబు

బోథ్: 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబ్ అవుతున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలు కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేసేందుకు కార్యాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కార్యాలయాల వద్దా వివిధ రంగుల జెండాలను కట్టడం జరిగింది.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నేరడిగొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పట్పడి తండా గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలతో 10 రోజుల క్రితం భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం జరుగుతున్న రోడ్డు పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. రానున్న రోజుల్లో గిరిజన గ్రామాలకు మంచి రోడ్ల సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

● క్రీడలతో మానసిక ఉల్లాసం

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో జరుగుతున్న బుగ్గారాం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం గెలిచిన టీమ్‌లకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సొంత డబ్బులతో మొదటి బహుమతి రూ.25 వేలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఇందులో రాథోడ్ సురేందర్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు మహేందర్, కరణ్, పవన్, బాబులాల్, బుగ్గరాం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన స్టేజ్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ప్రారంభించారు.

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

భోథ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బోథ్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు తల్లిదండ్రులను విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పూలు చేతికిచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీకొండ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఉంటుందని వివరించారు. ఇందులో ఉపాధ్యాయులు బయలు సతీష్ కుమార్ రజిత, అనసూయ, సవిత, నవ్యశ్రీ, పాఠశాల చైర్మన్ లలిత పాల్గొన్నారు.

కళాశాలలో సంవిధాన్ గౌరవ్ అభియాన్

ఉట్నూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పూలజీ బాబా కళాశాల ఆవరణలో భారతరత్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగా గౌరవ దినోత్సవంపై బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ భారత రాజ్యాంగంపై కళాశాల విద్యార్థులతో చర్చ గోష్ఠి నిర్వహించారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ ఎంపీపీ ఆడే ధనేలాల్, రాథోడ్ షేశారావు, సాడిగే రాజేశ్వర్, కూటికల ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర పాఠశాలలో మాక్‌పోలింగ్

బజార్‌హత్నూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కురుక్షేత్ర ప్రైమరీ పాఠశాలలో శనివారం పాఠశాల యజమాన్యం మాక్‌పోలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రొసిడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ ఆఫీసర్, ఇద్దరు సహాయకులుగా విధులు నిర్వహించగా.. విద్యార్థులు తమకు నచ్చిన వారిని ఓటు రూపంలో నమోదు చేసుకుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కిషన్ మాట్లాడారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు కోరెడ్డి శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మంశంకర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

● బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర

బోథ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి బోథ్ బస్టాండ్ వద్ద మనవహారంగా నిలబడి ఓటు హక్కు దుర్వినియోగం చేయమంటూ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని దానిని దుర్వినియోగించవద్దని సూచించారు. ఓట్లను అమ్ముకోవద్దని 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఇందులో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై ప్రవీణ్, ఎంపీడీవో రమేష్, ఎంఈవో కుమ్మరి పోశెట్టి, వివిధ పాఠశాల విద్యార్థులు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

అలాగే, మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు ఓటుకున్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. దీంతో విద్యార్థులు ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ముగ్గులు వేయడం జరిగింది.

● ఓటును మించిన ఆయుధం లేదు

తలమడుగు: ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును మించిన ఆయుధం లేదనీ తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది అన్నారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్రావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఉపాధ్యాయుడు వినోద్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మానవహారంగా నిల్చుని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

● ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం

నేరడిగొండ: మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల ఎం.స్వామి మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇందులో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, అధికారులు బీఎల్‌వోలు, మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ముందు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

ఆత్మహత్యల నివారణకే పెట్టుబడి సహాయం : నిరంజన్‌రెడ్డి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతు ఆత్మహత్యను నివారించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ రైతులకు పెట్టుబడి సాయం అందించిందని, కానీ కాంగ్రెస్ రైతు భరోసా ఇవ్వని కారణంగా అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, యాదవరెడ్డి, బాజీరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, జోగు రామన్నతో కలిసి మాట్లాడారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకోవద్దని గత సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

బోథ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ కార్యాలయంలో స్పోర్ట్స్ శివసేన రెడ్డిని ఏబీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ తులా అరుణ్ కుమార్ మర్యాదపూర్వకంగా శనివారం కలిసి విన్నవించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రచించి జిల్లాను క్రీడలలో ముందు ఉంచాలని కోరారు.

ఆర్టీసీ బస్సులో దొరికిన సర్టిఫికెట్ల అప్పగింత

బోథ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం వచ్చిన ఆదిలాబాద్ డిపో బస్సులో డ్యూటీలో ఉన్న కండక్టర్ ఎన్ఎస్ నర్సయ్యకు సర్టిఫికెట్లతో కూడిన బ్యాగు లభించింది. అందులో కరత్వాడ గ్రామానికి చెందిన విద్యార్థి భీమ లింగు కూతురు సర్టిఫికెట్లు లభించాయి. దీంతో వాటిని కండక్టర్ ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు అందింగగా. విద్యార్థిని తండ్రికి సమాచారం ఇచ్చి సర్టిఫికెట్లను అప్పగించారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

తలమడుగు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న పాఠశాల ఉపాధ్యాయుడిపై ప్రధాన ఉపాధ్యాయురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ఉపాధ్యాయునికి సంబంధించిన మెడికల్ లీవ్ కు కావలసిన సర్టిఫికెట్లను తేవాలని ఉపాధ్యాయుని కోరగా.. సకాలంలో సర్టిఫికెట్లు అందించలేదని వాటిపై ఉపాధ్యాయుని అడుగగా దురుసుగా మాట్లాడాడని, ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ప్రధాన ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేశారు. శనివారం పాఠశాలకు విచారణ అధికారులు వచ్చారు. అయితే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సదరు ఉపాధ్యాయుడు మాటమాట పెరిగే గొడవ కావడంతో ప్రధానోపాధ్యాయులు 100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు పాఠ శాలకు వచ్చి ఉపాధ్యాయున్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిచారు. అంతే కాకుండా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిగినిలో యువకుడి బలవన్మరణం

బోథ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ అర్జున్(35) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. మృతుడు గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం మత్తులో ఉంటున్నాడని భార్య రేణుక ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొంది. అయితే శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో మోనోసిల్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఈ సమయంలో భార్య పిల్లలు ఇంట్లో ఎవరు లేకపోగా సమీప ఇళ్ల లోని వారు వాసన వస్తున్న విషయాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా రాథోడ్ అర్జున్ మృతి చెంది ఉన్నాడని గ్రామస్తుల ద్వారా తెలిసింది. దీంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని శవ పంచానామా నిర్వహించడం జరిగింది.

గ్రామాల్లో పథకాల పంచాయితీ!

(5వ పేజీ తరువాయి...)

చేసింది. ఈ జాబితాలతో స్థానిక నేతలు ఎవరికి వారే జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. తమ ప్రమేయంతోనే లబ్ధిదారుల ఎంపిక జరిగిందంటూ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు లబ్ధిదారుల జాబితాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ తమ ఈమేజ్‌ను పెంచుకునేందుకు ఆరాట పడుతున్నారు. ఎలాగైనా రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచేందు కు ప్రయత్నాలు మొదలు పెట్టారు. కొందరు నేతలైతే లబ్ధిదారుల జాబితాలతో పోస్లు చేస్తూ ఇంటింటికీ తిరుగుతూ పథకాలను తామే మంజూరు చేయించామంటూ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో మంచి పలుకుబడి, పరపతి ఉన్న నేత లు ఓటర్లను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. తమకు మద్దతుగా నిలుస్తేనే పథకాలు అందుతాయని అధికార పార్టీ నేతలు చెబుతుండగా.. ప్రతిపక్షాలు మాత్రం దానికి భిన్నంగా వాదిస్తున్నాయి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎవరికి అనుకూలంగా మారుతాయో? వేచి చూడాల్సి ఉంది.

పైచేయి సాధించేందుకు పట్టు

రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొందరు నేతలు ముందుచూపుతో ఉన్నట్లు తెలుస్తుంది. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఓటర్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామాల్లో తమకున్న బలబలాలను అంచనా వేసుకుంటూ మరింతగా బలపడే విధంగా ప్లాన్ చేస్తున్నారు. తమను నమ్ముకున్న వారికే సంక్షేమ పథకాలు అందే విధంగా పైరవీలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సహాయంతో పథకాలను మంజూరు చేయిస్తూ పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అగ్రనేతల ద్వారా అధికారులపై ఒత్తిళ్లు చేయిస్తూ లబ్ధిదారుల జాబితాలను తారుమారు చేస్తున్నారు. అనుకూలంగా లేని అధికారులపై బెదిరింపులకు సైతం దిగుతున్నారు. పట్టుబట్టి మరి లబ్ధిదారుల జాబితాలలో తమ అనుచరుల పేర్లు ఉండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పోటాపోటీగా పైరవీలు చేయడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. ఎవరికీ జై కొట్టిన ఏం జరుగుతుందో?నని అధికారు లు ఆందోళనకు గురవుతున్నారు. మొత్తానికి గ్రామాల్లో పైచేయి సాధించేందుకు నేతలు పట్టుబట్టడంతో స్థానిక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బజార్‌హత్నూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన మైల నర్సయ్య(56) అనే రైతు అప్పుల బాధ భరించలేక ఉదయం 5గంటల సమయంలో తన చేనులోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న ఆరు ఎకరాలలో పత్తి, కంది పంటలను సాగు చేశాడు. ఆశించినంత సాగు లాభదాయకంగా ఉండక పోవడంతో దిగుబడి సరిగ్గా రాక ఆర్థికంగా ఇబ్బందుల పాలయ్యారని కుటుంబీకులు పేర్కొన్నారు. దాదాపు రూ.10లక్షల వరకు అప్పు ఉండడంతో మనోవేదనకు గురై ఉదయం సమయంలో పంట పొలంలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● పాముకాటుతో మరొకరు..

సిరికొండ: వ్యవసాయ పొలంలో పంటకు నీళ్ళు పెడుతుండగా పాము కాటుకు గురై ఓరైతు చికిత్స పొందుతూ శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం.. మండలంలోని మల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ధర్మాసాగర్ గ్రామానికి చెందిన సాబ్లే గురు(60) వృత్తి రిత్యా వ్యవసాయదారుడు. శనివారం మధ్యాహ్నా తన పొలంలో జొన్న పంటకు నీళ్లు పెడుతుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాబ్లే గురు మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుళ్ల ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

‘రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తా’

సారంగాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల స్థానిక రాజీవ్ మార్కెట్ యార్డ్‌లో కౌట్ల(బి) సొసైటీ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన కందులను దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఐరా నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, నాయకులు సత్యనారాయణ గౌడ, రావుల రాంనాథ్, రాంశంకర్‌రెడ్డి, వడ్డీ రాజేందర్‌రెడ్డి, బడి పోతన్న, కరిపే విలాస్, కాల్వ నరేష్‌లతో పాటు నాయకులు, ఆయా శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఏఎస్పీ అవినాష్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా గ్రామస్తులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్సై మాలిక్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

కుభీర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కుభీర్ ఎస్సై రవీందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వివేకానంద చౌక్ నుంచి తెలంగాణ తల్లి కూడలి వరకు పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఫోర్ విల్లర్స్ సీట్ బెల్టు తప్పనిసరిగ పెట్టు కోవాలని సూచించారు. స్థాయిని మించి ఓవర్ స్పీడ్‌లో వాహనాలు నడిపితే జరిగే ప్రమాలు ఎలా ఉంటాయి అనే దానిపై అవగాహన కల్పించారు. మనలనే నమ్ముకునొ జీవిస్తున్న బార్య పిల్లల గురించి ఆలోచించాలన్నారు. రోడ్డు బద్రత నియమాలు పాటించక పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామస్తులు తదితరులున్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి ఒకరి మృతి

సారంగాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల నాగపూర్ తండా సమీపంలో శ్రీనివాస్ అనే వ్యక్తి మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన శ్రీనివాస్ గత కొన్ని రోజుల క్రితం సారంగాపూర్ మండల కేంద్రంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తే మద్యానికి బానిసై మద్యం మత్తులో లోయలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

కుంటాల, జనవరి, 25 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, ప్రీ యూనిక్ ప్రైయివేట్ లిమిటెడ్ అవగాహ న క ల్పించారు. ఆయిల్‌పామ్ నాటే రైతులు తమ తోటలో పాటించే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్‌లో వచ్చే మొదటి సంవత్సరం నుంచి 30 నెలల వరకు వచ్చిన పూత గెలలను తొలగించాలని, మూడు సంవత్సరాలు పూర్తి అయిన తోటలో క్రాప్ వస్తుందని ఆయిల్ పామ్‌కు వచ్చే చీడపీడలు, సస్య రక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు.

అర్హులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

● జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ధర్మసాగర్ సమీపంలో గల అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని తెలిపారు. విద్యార్థులందరూ తమకు ఓటు హక్కు వయసు రాగానే తమ పేర్లను నమోదు చేసుకొని తప్పకుండా ఓటు వేయాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు. విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి వారందరూ ఓటు వేసేలా చూడాలన్నారు. అధికారులు ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి అన్ని ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ విద్యార్థుల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో పి. రామారావు, తహసీల్దార్లు రాజు, సంతోష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి ఓటు విలువను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ ఆధ్వరయంలో బయోకెమిస్ట్రీ డీఆర్‌పీ వైద్యులు డా. వేణుగోపాలకృష్ణ విద్యార్థులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఓటు ప్రాముఖ్యతను, ఓటు ఆవశ్యకతను తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్‌తో పాటు మైక్రోబయాలజీ శాఖాదిపతి దరహాస, బయోకెమిస్ట్రీ డా. వేణుగోపాలకృష్ణ, విద్యార్థులు బాలాజీ, మానస, వివేక్, క్రిష్ణ, సిబ్బంది మహేష్, ప్రశాంత్, వర్ష, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

నిర్మల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం రోజు జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సమాజంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థులందరికీ అదనపు కలెక్టర్లతో కలిసి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో పి.రామారావు, డీఎంహెచ్‌వో రాజేందర్, సీపీవో జీవరత్నం, వెనుక బడిన తరగతుల అధికారి శ్రీనివాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ట్రాన్స్‌జెండర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని అభినందించిన కలెక్టర్

గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో పట్టణానికి చెందిన ఆరు సంవత్సరాల బాలిక బి.శాన్విక వినూత్నరీతిలో ప్రతీఒక్కరూ ఓటు హక్కు గురించి చైతన్య పరిచింది. స్థానిక కూరగాయల మార్కెట్‌లో, సోషల్ మీడియాలో అవగాహన కల్పిం చింది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం రోజు కలెక్టర్ సమావేశ మందిరంలో చిన్నారి శాన్వికను బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవా ర్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ కార్యాలయంలో..

నిర్మల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంజికుమార్‌రెడ్డి మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, సామ రాజేశ్వర్‌రెడ్డి, గుడిపల్లి శ్రావణ్, గాదెవిలాస్, అయ్యన్నగారి రాజేందర్, సీనియర్ నాయకులు రచన, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బైంసాలో..



బైంసాలో విద్యార్థులు, అధికారుల మానవహారం

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్య క్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుతో స ర్పంచ్ నుంచి ప్రధాని దాకా అందరినీ ఎన్నుకునే హక్కు ఒక ఓటుకే ఉందన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెవెన్యూ అధికారులు వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖాధికారులతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాల శ్రేణులు పాల్గొన్నాయి.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం



మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణరాణి

దిలావర్‌పూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు చాలా బలమైందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దిలావర్‌పూర్ తహసీల్దార్ స్వామి, ఎంపీడీవో అరుణ రాణి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఓటు హక్కుపై ప్రజలను చైతన్యం చేయడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు మండల కేంద్రంలోని వీధులలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి జాతీయ రహదారిపై మానవహారాన్ని నిర్వహించారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటరు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, డీటీ యాదవరావు, ఎంపీడీవో కే. రమేష్, ఆర్ఐ గంగన్న, ఎంఈవో గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ప్రతిజ్ఞ

ఖానాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో తహసీల్దార్ శివరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

తిరుపెల్లిలో..

లక్ష్మణచాంద, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు శ్రీదేవి, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సోన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిద్దులకుంట గ్రామ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊరేగింపుతో వెళ్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరీష్ రెడ్డి, ఉపాధ్యాయులు కడారి దశరథ్, చంద్రశేఖర్ రావు, టి. నరేందర్, బి. నరేందర్, భూమారెడ్డి, ముర్తుజా ఖాన్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆష్టలో ప్రతిజ్ఞ

ముథోల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆష్ట, ఎడ్‌బిడ్ గ్రామాల్లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంఈవో రమణ రెడ్డి, ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ నారాయణ, ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ గ్రామస్తులకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. అన్నబాహుసాటే కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అదే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించి ప్రిన్సిపాల్ శ్రీహరి విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ ఓటు హక్కును ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఉపాధ్యాయులు గంగారాం, రాజేశ్వర్, సట్ల గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు సత్యశీల, వాణి, విజయ, తదితరులున్నారు.

కుంటాల, జనవరి, 25: (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రం కుంటాలలో స్థానిక హైస్కూల్ విద్యార్థులు పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఓటు హక్కు విలువ తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ 15వ అంతర్జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటు హక్కును ప్రజలు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు వినియోగంలో ఎవరూ వెనుకాడకూడదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంఈవో ముత్యం, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్, ఎస్సై భాస్కరాచారి పాల్గొన్నారు.

మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయుల బస

- మెస్రం వంశీయుల పటేళ్లకు ఘన స్వాగతం
- మహాపూజ నిర్వహణపై చర్చ
- కేస్లాపూర్‌కు ఆదివాసీ గిరిజనులు
- నేడు తూమ్ పూజలు

భక్తి



మర్రి చెట్టు వద్ద బస చేస్తున్న మెస్రం వంశీయులు



కేస్లాపూర్‌కు తరలివస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా దేవత మహాపూజకు అవసర మగు పవిత్ర గంగాజలంతో శుక్రవారం ఇంద్రాయి దేవతకు పూజలు చేసి, రాత్రి కేస్లాపూర్ గ్రామ సమీపంలో మర్రిచెట్టు వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులు, అక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. అక్కడే బస చేసి, శనివారం ఉదయం సంప్రదాయ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు నైవేద్యాలతో కూడిన వెదురు బుట్టలను వరుసలో ఉంచారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లపై వచ్చిన వంశీయులు, ఇక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా కూర్చొని పూజలతో పాటు, చర్చాగోష్ఠి నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన పటేళ్ల రాత్రి కేస్లాపూర్ వచ్చినట్లు నాగోబా పేన్ కొత్వాల్ మెస్రం తిరుపతి.. మర్రి చెట్ల వద్ద బసచేస్తున్న మెస్రం వంశీయులకు సమాచారం అందించారు. పీఠాధి పతి మెసం వెంకట్‌రావ్ పటేల్‌తో పాటు పటేళ్లకు పర్ధాంజీలు మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ మెస్రం గణపతి, తదితరులు సంప్రదాయం ప్రకారం ఆహ్వానించారు. మహాపూజలతో పాటు, సిరికొండ మండలంలో తయారు చేసిన మట్టి కుండలను తీసుకురావడం, పెద్దల పేరిట నిర్వహిం చే తుమ్(కర్మ కాండలు)పై చర్చించారు.

● మెస్రం పటేల్‌లకు ఘన స్వాగతం

పవిత్ర గంగాజలంతో మెస్రం వంశీయులు మర్రి చెట్టు వద్దకు శుక్ర వారం రాత్రి చేరుకోగా శనివారం రాత్రి ఆయా గ్రామాల నుంచి వస్తున్న మెస్రం పటేళ్లకు స్థానిక మెస్రం వంశీయులు స్వాగతం పలికారు. ఆలయ పీఠాదిపతి వెంకట్‌రావును సాంప్రదాయ వాయిద్యాలతో మర్రి చెట్టు వద్దకు తీసుక వచ్చారు. కాగడ హారతి పట్టి స్వాగతం పలికారు.

● నేడు తూం పూజలు

మెస్రం వంశీయులలో చనిపోయిన వారికి ఆదివారం మర్రి చెట్టు వద్ద తూం(కర్మకాండ) పూజలు నిర్వహించనున్నారు. మెస్రం వంశీయులలో చనిపోయిన వారికి ఎవరైన కర్మకాండలు జరపక పోతే నాగోబా చెంత ఉన్న మర్రి చెట్టు వద్ద పూజలు చేయడం మెస్రం గిరిజనుల ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో చిన్నుపటేల్, కటోడ మెస్రం కోసేరావు, మెస్రం దేవ్‌రావు, మెస్రం నాగనాథ్, మెస్రం తుకారం, మెస్రం శేఖు, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పాఠశాలలపై పకడ్బందీ పర్యవేక్షణ

● ఆశన్న, ఎంఈవో,ఉట్నూర్



ఆంధ్రజ్యోతి: పాఠశాలలపై పర్యవేక్షణ చేస్తున్నారా...?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలల పై పకడ్బంధీ పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు పేద మధ్య తరగతి పిల్లలు వచ్చి చదువుకుంటున్నందున వారికి విద్యబోధన సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉట్నూర్ మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి.

ఎంఈవో: ఉట్నూర్ మండలంలో 135 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 200 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, మూడు ఖాళీలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉదయం 9గంటల నుంచి 4-15 నిమిషాల వరకు పని చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

ఎంఈవో: గతంలో పాఠశాలలకు స్కావెంజర్లు లేక పరిశుభ్రత ఇబ్బందులు ఉండేవి. ప్రస్తుతం స్కావెంజర్లను నియమించడం వల్ల ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు తీసుకుంటున్నాం. స్కావెంజర్లకు మూడు నెలల బకాయి వేతనాలు కూడా మంజూరు అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలకు స్కూల్ గ్రాండ్స్ మంజూరు వుతున్నాయా?

ఎంఈవో: అన్ని పాఠశాలలకు స్కూల్‌గ్రాంట్స్ మంజూరు అయ్యాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఇంకో పాఠశాలకు 5000 నుంచి ఉన్నత పాఠశాలలకు లక్ష వరకు స్కూల్ గ్రాండ్ మంజూరు అవుతుంది.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజనం కొనసాగుతుందా?

ఎంఈవో: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగిస్తున్నాం. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మధ్యాహ్న భోజన సమయంలో పర్యవేక్షిస్తున్నారు.

●ఉట్నూర్-ఆంధ్రజ్యోతి



వేడుకలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

వీరాంజనేయ శివసాయి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభం

ఖానాపూర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈ ఏడాది సైతం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ బృందం ఈ వేడుకలను ప్రారంభించింది. ఈ సందర్భంగా శనివారం ఉదయం తొమ్మిది గంటలకు మహా గణపతి పూజ, పుణ్యాహవచనము, ధ్వజారోహణ నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మాణం చేసిన పారాయణ మండపంలో పలువురు భక్తులు సాయి సచ్చరిత్ర, గురుచరిత్ర పారాయణాన్ని ప్రారంభించారు. వారం రోజులపాటు నిర్వహించే ఈ పారాయణాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో చేస్తారు. ఆలయానికి పారాయణ కోసం తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు అంకం రాజేందర్ తెలిపారు. ఈ పారాయణంలో 103 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, కట్కం శేఖరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు మడిగెల గంగాధర్, ఏ.సంజీవరావు, బీసీ రాజన్న, కొత్తపల్లి సురేష్, కే.గంగారావు, బక్కశెట్టి లక్ష్మణ్, కారింగుల రాములు, కారింగుల సుమన్, తిలక్‌రావు, వెంకటప్పయ్య, ద్యావతి రాజేశ్వర్, జితేందర్, అశోక్‌రావు, నాగరాజు, మల్లేష్, గంగనర్సయ్య, తదితరులున్నారు.



గణతంత్ర వేడుకలకు
ఘనమైన ఏర్పాట్లు

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఆదివారం నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబు అయ్యాయి. త్రివర్ణ పతకాల ఎగురవేతకు గాను గద్దెలను రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రంగురంగుల కాగితాలతో అలంకరించడంతో కార్యాలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థులు పోటీలు పడి తరగతులను అలంకరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేడుకలను కన్నుల పండువగా నిర్వహించుకునేందుకు గాను ఘనంగా ఏర్పాట్లు చేపట్టారు. వివిధ పాఠశాలల విద్యార్థులు వేడుకల్లో భాగంగా నిర్వహించబడే ప్రభాత్‌భేరి కోసం ప్రాక్టిస్ చేశారు. జాతీయ నాయకుల వేషధారణతో ప్రభాత్ భేరిలో పాల్గొనేందుకు గాను పలు పాఠశాలల విద్యార్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. పలు విద్యా సంస్థల్లోని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆటల పోటీలను నిర్వహించారు. ప్రభాత్‌భేరి సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగ కుండా ఉండేందుకు గాను మున్సిపల్ అధికార యంత్రాంగం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల రోడ్లకు అవసరమైన మరమ్మతులు నిర్వహింపచేశారు.

మూడు ప్రభుత్వ పాఠశాలల్లో బహుమతులకు
కౌన్సిలర్ చందులాల్ ఆర్థిక సాయం

పట్టణ పరిధిలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో గణతంత్ర్య దిన్సోతవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన ఆటలపోటీల విజేతల బహుమతుల పంపిణీకి మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్ ఆర్థికసాయం అందించారు. శనివారం మధ్యాహ్నం వేళలో మున్సిపల్ కౌన్సిలర్ స్థానిక పిప్రి కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల, ఏపీ నగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం మూడు పాఠశాలల్లోని ఆటల పోటీల విజేతలకు బహుమతులను అందచేసేందుకు గాను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విరాళం అందించారు.

జాతీయ పతాకం ఎగరాలి

- ముచ్చటైన మూడు రంగుల జెండాకు ఘనమైన చరిత్ర
- మువ్వన్నెల జెండా నిబంధనలు పాటిద్దాం

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకం అంటే ఎవరికైనా ఎంతో గౌరవం, జాతీయ భావాన్ని నరనరాల్లో ఉప్పొంగిస్తుంది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంబరాలు జరుపుకుంటారు. జాతీయ పతాకాన్ని రూపొందించుకున్న క్రమంలోనే నిబంధనలు కూడా ఏర్పాటు చేశారు. ఆ నిబంధనలు పాటించి జాతీయ జెండాను ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

● జెండా నిబంధనలు ఇవి..

- జాతీయ జెండా ఎగురవేసే సమయంలో ఇతర సందర్భాల్లో నిబంధనలు పాటించాలి
- జాతీయ పతాకం వందనానికి ఎవరైనా జెండాను ఎదురుగా నిలబడి వందనం చేయాలి
- ఇతర జెండాలతో కలిపి ప్రదర్శించాల్సి వస్తే జాతీయ జెండాను అన్నింటికంటే కుడి భాగాన ఉంచాలి. జెండాను ఎక్కడ ఎగురవేసినా స్పష్టంగా కనిపించాలి. అందరూ గౌరవ భావంతో చూడాలి.
- ఉత్సవ సమయంలో జెండాపైకి ఎగురవేసేటప్పుడు వడివడిగాను కిందకు దిగుతున్నప్పుడు నిదానంగా ఉండాలి. ఊరేగింపుగా వెళుతున్నప్పుడు ముందు భాగంలో కుడివైపు ఉండాలి. పెను తుపాను వీస్తున్నప్పుడు పతాకాన్ని ఎగురవేయవద్దు. ప్రముఖ వ్యక్తుల మృతికి గౌరవంగా సగానికి దించాలి
- సూర్యుడు ఉదయించినప్పటి నుంచి అస్తమించే వరకు జెండాను ఎగురుతుండాలి.
- జాతీయ జెండాను రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లు, విదేశాల్లోని భారత రాయబారులు, ప్రధాని, కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పతాకాన్ని ఉంచుకోవచ్చు. వాణిజ్య పరమైన లాభాల కోసం పతాకాన్ని వాడరాదు. దుస్తులుగా కుట్టించుకోకుడదు. జాతీయ పతాకంపై ఎలాంటి రాతలు రాయవద్దు
- జాతీయ జెండాను, జాతీయ గీతాన్ని అగౌరవ పరిస్తే ఏడాది నుంచి మూడేళ్ల వరకు శిక్ష పడుతుంది.
- జాతీయ పతాకంతో పాటు జాతీయ గీతం కూడా ప్రధానమైంది. పతాకాన్ని ఎగురవేసిన వెంటనే జాతీయ గీతం పాడాలి.

నేటితో ముగియనున్న మున్సిపల్ కౌన్సిల్ పదవీ కాలం

- సాదాసీదాగా కొనసాగిన చివరి కౌన్సిల్ సమావేశం
- రేపటి నుంచి ప్రత్యేకాధికారి పాలన



ముగింపు సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ అధికార, పాలక వర్గాలు

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ పదవీ కాలం ఆదివారంతో ముగియనుంది. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సాబీయాబేగం ఆధ్వర్యంలో చివరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. సాదాసీదాగా కొనసాగిన కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలోని అంశాలన్నింటిని నామమాత్రపు చర్చతో సభ్యులు ఆమోదించారు. కౌన్సిల్ చివరి సమావేశానికి వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముగింపు సమావేశంలో మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ సాబీయా బేగం, జాబీర్ అహ్మద్‌ల మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పదవీ కాలంలో అన్ని విధాలుగా సహకరించిన కౌన్సిలర్లందరికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులకు అరకొరగా నిధులు మంజూరైనప్పటికి ఆదర్శవంతమైన రీతిలో ప్రగతికి బాటలు వేసామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసామని వెల్లడించారు. అధికార, పాలక వర్గాల సహాయ,సహకారాలు, తోడ్పాటుతోనే అనుకున్న మేర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, మేనేజర్ గౌరిష్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

● రేపటి నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోకి

మున్సిపల్ కేంద్రాలు సోమవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ఎడాది కాలంగా కొనసాగుతుండగా తాజాగా మున్సిపాలిటీలు సైతం ప్రత్యేకాదికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ కౌన్సిల్ పదవీ కాలం ఆదివారం ముగియనుండటంతో సోమవారం నుంచి ప్రత్యేకాధికారి పాలన ప్రారంభం కానుంది. ప్రభుత్వం ఆదివారం మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను ప్రకటించనున్నట్లుగా తెలిసింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ఆలయంలో మెస్రం వంశీయులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మెస్రం వంశీయులతో జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ నెల 28న నాగోబా మహాపూజకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రానున్నట్టు చెప్పారు. నాగోబా ఆలయంలో ఆదివాసీ మ్యూజియం, వసతిగృహాలు, తదితర ఆలయ అభివృద్ధి పనులకు 13 కోట్ల 60లక్షల నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు.

● నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం..

నాగోబా ఆలయ కమిటీ చైర్మన్‌గా మెస్రం ఆనంద్‌రావు, సభ్యులుగా మెస్రం నాగోరావు, మెస్రం భీంరావ్, మెస్రం ఆనంద్‌రావు, మెస్రం చైతన్య, మెస్రం జంగుబాపు లకు శనివారం నాగోబా ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో రాజమౌళి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, మెస్రం నాగనాథ్, సోమోరే నాగోరావు, ఎండీ మసుద్, ఎండీ జహార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

● ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

లోకేశ్వరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఇందులో భాగంగా లోకేశ్వరం తహసీల్దార్ మోతీ రాం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటరు దినోత్సవానికి సంబంధించిన నినాదాలతో ప్రధాన వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం భగత్ సింగ్ చౌక్ వద్ద మానవహారంగా నిల్చొని ప్రతిజ్ఞ చేశారు. లోకేశ్వరం మండల కేంద్రంలోని అమెరి కిడ్స్ స్కాలర్స్ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి చిన్న ప్రదర్శన ద్వారా వివరించారు. ఓటరు దినోత్సవంలో భాగంగా లోకేశ్వరం తహసీల్దార్ మోతీ రాం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో వెంకట రమేష్, ఎంపీవో సల్మాన్ రాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, లోకేశ్వరం ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 । కనిష్ఠం 17.4



పశు సంరక్షణ బోర్డుకు కదలిక



జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఇదే

- నాన్ ఆఫీషియల్ సభ్యుల నియామకానికి రంగం సిద్ధం
- జిల్లాలో గోశాల, ఎన్‌జీఓ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవకాశం
- దరఖాస్తులు కోరిన పశుసంవర్ధకశాఖ

నిర్మల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పశుసంరక్షణబోర్డు పునఃనిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ బోర్డును పునరుద్ధరించాల్సి ఉండగా గత ప్రభుత్వం ఈదిశగా దృష్టి సారించలేదు. దీంతో 2022 సంవత్సరం నుంచి బోర్డు సభ్యుల నియామకం నిలిచిపోయింది. దీంతో పశుసంరక్షణ చర్యలకు సైతం బ్రేక్ పడినట్లు అయ్యింది. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి జంతు సంరక్షణ బోర్డును ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. దీని కోసం గానూ బోర్డులో సభ్యులుగా నియమించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాల వారీగా పశుసంవర్ధకశాఖ సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు సైతం కోరుతోంది. గోశాలల ప్రతినిధులు, గోసేవా చేసే ప్రతినిధులతో పాటు పశుసంరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు పశువైద్య సంఘాల ప్రతినిధులు అలాగే యూత్‌తో కూడిన ఎన్‌జీఓల ప్రతినిధులను ఈ బోర్డులో సభ్యులుగా నియమించనున్నారు. మొత్తం ఆరు కేటగిరిల నుంచి ఈ బోర్డులో సభ్యులుగా నిమమించేందుకు నిర్ణయించారు. అయితే జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు పశుసంరక్షణ బోర్డు కార్యవర్గం లేని కారణంగా పశుసంరక్షణ కార్యకలాపాలు అంతట సన్నగిల్లాయి. ముఖ్యంగా పశువుల వల, పశు సంరక్షణతో పాటు పశు వుల అక్రమ రవాణాను నిరోధించేందుకు సరైన యంత్రాంగం కరువైంది. అలాగే పరిపాలన పరమైన అజమాయిషీ కూడా లోపించింది. అయితే ప్రభుత్వం ఎట్టకేలకు బోర్డును ఏర్పాటు చేసి పశు సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.



మూడేళ్ల తరువాత

కాగా 2022 సంవత్సరం నుంచి పశు సంరక్షణ బోర్డును పునరుద్ధరించడం లేదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బోర్డు ఏర్పాటుపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడం పశు సంరక్షణకు శాపంగా మారింది. పశు సంరక్షణ విషయంలో సంబంధిత శాఖకు దిశానిర్దేశం కూడా కరువైందన్న వాదనలున్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు పశు సంరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా అన్ ఆఫీషియల్ సభ్యులను నియమించేందుకు సైతం నోటిఫికేషన్ జారీ చేసింది. మరో నెల రోజుల్లోగా సభ్యుల నియామకంతో పాటు బోర్డు కార్యచరణను కూడా ప్రారంభించేందుకు రంగం సిద్దమవుతోంది.

అర్హులకే అవకాశం

కాగా పశు సంరక్షణ బోర్డులో అర్హులైన వారికే అవకాశం కల్పించేందుకు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా గోశాలలు నిర్వహించే సంస్థల ప్రతినిధులకు, స్వచ్ఛందంగా గోసేవ చేసే వారికే కాకుండా స్వచ్ఛంద సంస్థలకు, ప్రైవేటు పశు వైద్యులకు అవకాశం కల్పిస్తున్నారు. అయితే సభ్యత్వం కోసం దరఖాస్తులు చేసుకునే వారు అన్ని రకాలుగా అనుకూలమైన డాక్యుమెంట్లను సమర్పించాలని కోరుతున్నారు. గతంలో ఈ సంస్థల సభ్యులు పశు సంరక్షణ కోసం చేసిన సేవా కార్యక్రమాలతో పాటు ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన డాక్యుమెంట్‌లను తమ దరఖాస్తుతో సమర్పించాలని ప్రభుత్వం కోరుతోంది. పూర్తిస్థాయిలో అనుభవైన వారికే అవకాశం కల్పించబోతున్నారు. ఇప్పటి

వరకు బోర్డులు, ఇతర సంస్థల్లో రాజకీయ నేతల సిఫారసులకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ఏర్పాటు చేయబోయే బోర్డులో మాత్రం రాజకీయ జోక్యం లేకుండా చూస్తున్నారు. ఇందులో భాగంగానే గోశాలల నిర్వహకులు, ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు బోర్డులో అవకాశం కల్పించాలని నిర్ణయించారు.

జిల్లాలో పశుసంపద	
ఆవులు	1,79,002
గేదెలు	1,21,182
గొర్రెలు	5,01,745
మేకలు	1,31,935

మూడేళ్ల కాల పరిమితి

కాగా ప్రస్తుతం ఏర్పడబోతున్న పశుసంరక్షణ బోర్డు కాలపరిమితిని మూడేళ్ళుగా నిర్ధారించారు. ఇందులో సభ్యులుగా నియమింపబడ్డ వారం తా మూడేళ్ల పాటు పశు సంరక్షణ కోసం కృషి చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు తమకున్న పశు సంరక్షణ అనుభవాన్ని బోర్డు ద్వారా కొనసాగించాలని భావిస్తున్నారు. దీని కోసం గానూ వారందరికి బోర్డులో అవకాశం కల్పించి వారి సేవలను ఉపయోగించుకోవాలని సంబంధిత శాఖ భావిస్తోంది. 2022 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు సంక్షేమ బోర్డు కాల పరిమితి ముగిసిపోయినప్పటికి అప్పటి ప్రభుత్వం మాత్రం కొత్త బోర్డును ఏర్పాటు చేయలేకపోయింది. దీంతో పశు సంరక్షణ శాఖకు దిశానిర్దేశం కూడా కరువైందన్న వాదనలు తెరపైకి వచ్చాయి. బోర్డు ఏర్పాటుతో పశు సంరక్షణ శాఖకు కొంతమేరకు అండగా నిలిచే అవకాశం ఉండేది. అయితే అప్పటి నుంచి బోర్డుపై కొనసాగిన నిర్లక్ష్యానికి ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోందని అంటున్నారు. దీంట్లో భాగంగానే మళ్లీ తాజాగా పశు సంరక్షణ బోర్డును పునరుద్ధరించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. మొదట అనధికారిక సభ్యుల నియమకాన్ని చేపట్టి ఈ కమిటీ సభ్యులను మూడేళ్ళ పాటు కార్యకలాపాలను కొనసాగించాలని భావిస్తోంది.

ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం



అఖండ హరినామ సప్తాహంలో కీర్తనలు పాడుతున్న భక్తులు

ముథోల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలో శనివారం స్థానిక హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్తాహం శ్రీ నారాయణ మహారాజ్ నేతృత్వంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సప్తాహం శనివారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగనుంది. రాత్రి వేళల్లో మహారాజులచే కీర్తనలు, ప్రతిరోజు వేకువజామున కాకడ హారతితో పాటు ఏడు రోజులు భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. మొదటి రోజు ప్రత్యేకపూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాసర ఆలయ అభివృద్ధి కోసం వీహెచ్‌పీ ఆందోళన



బాసర, జనవరి, 25 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆల యాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. శనివారం పుణ్యక్షేత్రంలోని వ్యాస మహర్షి ఆలయం ఎదుట వీహెచ్‌పీ కార్యకర్తలు నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. అమ్మవారి ఆలయ అభివృద్ధిపై గత 11 ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు, పత్రికల్లో వచ్చిన వార్తలను ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో విశిష్టమైన అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని అన్నారు. పసిపిల్లలతో అక్షరా భ్యాసం కోసం బాసరకు వస్తున్న భక్తులు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల నుంచి కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ వచ్చిన భక్తులకు కనీసం తాగునీటి వసతి కల్పించలేని స్థితిలో ఆలయ అధికారులు ఉన్నారని విమర్శించారు. ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఫిబ్రవరి మొదటివారంలో జరిగే వసంత పంచమి వేడుకల అనంతరం ఈ ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉత్సవాల భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



బాసర, జనవరి, 25: (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో జరిగే వసంత పంచమి వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి శనివారం జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో పర్యటించి కింది స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చిన భక్తులు సజావుగా అమ్మవారిని దర్శించుకునే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ ఉన్నారు.

భయం వీడి లక్ష్యంతో చదవాలి

మామడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భయం వీడి లక్ష్యంతో చదవాలని ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా ఆర్‌సీవో గోపీచంద్ అన్నారు. శనివారం రోజున మామడ మండలంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న వేల విద్యార్థులతో 'ముఖాముఖి' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇన్సెంటివ్ పరీక్షలలో విద్యార్థులకు వచ్చినటువంటి పరీక్ష మార్కుల జవాబు పత్రాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పరీక్షలకు వెళ్లే సమయంలో భయాందోళనలకు గురి కావద్దని పరీక్షలు రాసే సమయంలో చేతి వేళ్లు బాగుండాలని, ఎక్కువ మార్కులు రావడాని కోసం కొన్ని సూచనలు చేశారు. పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అవలంబించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.రాజు, ఉపాధ్యాయులు నిరోష, నాగరాజు, వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మి, నర్సయ్య, అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

సోన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజాలో పనిచేసే 75 మంది కార్మికులు వేతనాల గురించి శాంతియుతంగా నిరసన తెలుపుటకు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. రిజిస్టర్ నెంబర్ 0073/2014 గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాము. నూతనంగా వచ్చే కంపెనీ మాకు ఉన్నటువంటి వేతనాలపై కోత విధిస్తుందని వారు అన్నారు.

బెల్ట్‌లు, ఐడెంటీ కార్డుల విరాళం

భైంసా రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానల్‌పాడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ విద్యార్థిని విద్యార్థులకు తన వంతు సహాయంగా బెల్ట్‌లు, ఐడెంటీ కార్డులను విరాళంగా అందించారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బెల్ట్‌లు, ఐడెంటీ కార్డులు అందించిన రమేష్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌శాఖ సీఎండీని
కలిసిన మండల నాయకులు



కుబీర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యుత్‌శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డిని శనివారం మండల నాయకులు తూం రాజేశ్వర్, చౌహాన్ శంకర్‌లు కలిసారు. ఈ సందర్భంగా కుబీర్ మండలానికి ఒక 133/కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా మండలంలోని మాలేగావ్ గ్రామానికి ప్రత్యేకమైన ఏఈ నియమించాలని, మూడు సంవత్సరాల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన అడే కిషోర్ కాంపోజిషన్ డబ్బులను త్వరగా విడుదల చేయాలని, రైతులు ట్రాన్స్‌ఫారం కోసం డీడీలు కట్టడం జరిగిందని, వారికి పోల్స్ ట్రాన్స్‌ఫారం ఇప్పించాలని కోరారు. సీఎండీ వరుణ్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం హోరెత్తిన నిరసనలు

- ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ విద్యార్థుల ర్యాలీ
- కళాశాల యాజమాన్యాలు , ఉపన్యాసకుల భిక్షాటన
- కుభీర్‌లో ధర్నా



భైంసాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థుల నిరసన



ముథోల్‌లో భిక్షాటన చేస్తున్న ప్రైవేట్ కళాశాల సిబ్బంది

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోనున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌కు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం భైంసాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు, విద్యార్థులు చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. మధ్యాహ్నం వేళలో స్థానిక జీపీ లడ్డా డిగ్రీ కళాశాల నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పట్టణం లోని పలు ప్రాంతాల మీదుగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఇందులో విద్యార్థులు ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు చేపట్టారు. పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ నిరసనలతో హోరెత్తించారు. ఇక ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు, అధ్యాపకులు పట్టణం లోని ప్రధాన రోడ్డు మార్గాల మీదుగా భిక్షాటన చేపట్టారు. వ్యాపార సముదాయల్లోకి వెళ్లి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ నిధులు పెండింగ్‌లో ఉండటం మూలంగా తామందరం రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాని పేర్కొంటూ దుకాణాల లోకి వెళ్లి భిక్షాటన చేపట్టారు. ఒక వైపు విద్యార్థుల ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీ, మరో వైపు అధ్యాపకులు, కళాశాలల నిర్వాహకుల భిక్షాటనతో చేపట్టిన నిరసనలు ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్స్ విడుదల అవశ్యకతను ప్రస్పుటింప చేశాయి.

ముథోల్ మండల కేంద్రంలో..

ముథోల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం గీర్వాణి జూనియర్, డిగ్రీ కళాశాల, శ్రద్ధ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం విద్యార్థులు భిక్షాటన చేసి తమ నిరసనను వ్యక్తపరిచారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని భిక్షాటన చేశారు. తమ కళాశాల నుంచి ర్యాలీగా వచ్చి ముథోల్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద భిక్షాటన చేసి తమ నిరసనను వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్ల లక్ష్మణ్, వినాయక రావు, బాలానంద్ దేశ్‌ముఖ్, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, కే. సాయినాథ్, నవీన్, సాయినాథ్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, బి.లక్ష్మణ్, సురేష్, దత్తు, రాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా

కుభీర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచిన డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రం కుభీర్‌లో తపస్వి, వివేకానంద డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సట్ల రవి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రియంబర్స్‌మెంట్ ఫీజులు ప్రభుత్వం విడుదల చేయడం లేదని, దీంతో కళాశాలలు నడపడం భారంగా మారిందని, భవనాల అద్దే, ఆధ్యాపకులకు జీతాలు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అధ్యాపకులు దత్తాత్రి, సాయన్న, రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, పోశెట్టి, యోగేష్, మౌనిక, శ్రీకాంత్, దత్తు, విలాస్, రాజు, విజయ్, విద్యార్థులున్నారు.

అన్నదాతల సంక్షేమానికి అంకితభావంతో కృషి

- ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అరుగాలం శ్రమించే అన్నదాతల సంక్షేమానికి బాధ్యతాయుతమైన విధానాల ద్వారా అంకితభావంతో కృషి చేస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరు క్వింటాళ్లకు పరిమితిని పెంచాలని విజ్ఞప్తి మంత్రికి పేర్కొన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్ సిందే ఆనంద్ రావ్ పాటిల్, ఫారుఖ్ అహ్మద్, మిర్జాపూర పీఏసీఎస్ ఛైర్మెన్ దేవేందర్‌రెడ్డి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, మున్సిపల్ కౌన్సిలర్ గౌతంపింగ్లే, బీజేపీ ముథోల్ నియోజక వర్గ డైరెక్టర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, సిరం సుష్మారెడ్డిలతో పాటు రైతులు పాల్గొన్నారు.

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

కుంటాల, జనవరి, 25: (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో రాబోయే రోజుల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని విట్టాపూర్, ఓలా రహదారిపై నిర్మాణానికి, కుంటాల గజ్జలమ్మ ఆలయంలో రీడింగ్‌రూమ్ నిర్మాణానికి, ఆలయానికి రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు

అంతర్జాతీయ వైద్య శాస్త్రజ్ఞుల సదస్సులో నిర్మల్ వైద్యులు

నిర్మల్ ఛైన్‌గేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23వ తేదీ నుంచి కలకత్తాలో నిర్వహిస్తున్న జాతీయ, అంతర్జాతీయ వైద్యశాస్త్రజ్ఞుల సదస్సులో నిర్మల్‌కు చెందిన సీనియర్ వైద్యులు దామెర రాములు, రవికుమార్‌లకు అరుదైన అవకాశం దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో ఎందరో మంది వైద్యశాస్త్రజ్ఞులు పాల్గొన్న ఈ సదస్సులో జిల్లా నుంచి వీరిద్దరికి పాల్గొనే అవకాశం లభించింది. ఈ సదస్సులో ఒక సదస్సుకు దామెర రాములు అధ్యక్షత సైతం వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన సీనియర్ వైద్యుడిగా తన అనుభవాలను తాను ఎదుర్కొన్న సవాళ్లను అంతర్జాతీయ సదస్సులో దామెర రాములు వివరించారు. ఈ మేరకు శనివారం ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా వివరాలు తెలియజేశారు. ఈ వేదిక ద్వారా వైద్య రంగంలో వైద్యశాస్త్రజ్ఞులు చేసిన పరిశోధన పత్రాలను సమర్పించినట్లు వారు పేర్కొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నిర్మల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మూడవ రోజు ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల మైదానంలో వివిధ కళాశాలల విద్యార్థినులకు (రంగోలి) ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, గంగాధర్, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ జగతి, విభాగ్ కన్వీనర్ శశి, చంద్రగిరి, శివ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

మండలంలోని మేడిపల్లి గ్రామంలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటాడుతూ... కేంద్రంలో మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం తళితులకు బలహీన వర్గాలకు అనేక రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, తేకల అనిల్, లవకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కమిటీ ఛైర్మన్

నిర్మల్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ్ రెడ్డిలు శనివారం ప్రారంభించారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంనాథ్, సత్యనారాయణ గౌడ్, మేడిసెమ్మె రాజు, జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ గ్రామస్థుల దీక్ష విరమింపజేసిన ఎమ్మెల్యే

నిర్మల్ అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలం కడ్తాల్ గ్రామస్థులు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ గ్రామానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని గత కొన్ని నెలలుగా నిరవధిక దీక్ష చేపట్టారు. శనివారం కలెక్టర్, ఎమ్మెల్యే అధ్యక్షతన గ్రామస్థులతో సమావేశం నిర్వహించి ఎటువంటి అన్యాయం జరగకుండా సంబంధిత అధికారులతో పర్యవేక్షించి నెల రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నిరవధిక దీక్ష చేపట్టిన గ్రామస్థులతో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కిషోర్, ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా, మండల బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం తెలంగాణ ఉద్యమంలో చారిత్రకాంశాలు, చారిత్రక ఉద్యమ వ్యాసాలు, మిడ్ మానేర్ కవితా పుస్తకాలను ఆవిష్కరించారు. వీరాంజనేయ స్వామి ఆలయ ఛైర్మన్ కామారపు జగదీశ్వర్ ప్రియ మిత్రుడు కవి చారిత్రక పరిశోధకులు, రచయిత శ్రీ సంకెపల్లి నాగేంద్ర శర్మ రాసిన ఈ పుస్తకాలను రాశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కామారపు జగదీశ్వర్, కార్య నిర్వాహకురాలు భారతి, కార్యవర్గ సభ్యుడు పాటల రాజేశ్వర్, యువ కవి పురస్కార గ్రహీత పోలీస్ భీమేష్, ఆలయ కార్యవర్గ సభ్యుడు వెంకట్ నర్సయ్య, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.